


చినవెంకన్న సన్నిధిలో తెలంగాణ ఎన్నికల కమిషనర్

ప్రజాశక్తి – ద్వారకాతిరుమల

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి బుధవారం కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి చేరుకున్న పార్థసారథికి డిప్యూటీ తహశీల్దార్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పార్థసారధి శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు పార్థసారథికి, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేశారు. దుశ్శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.దుర్గారావు, ఆలయాధికారులు నటరాజన్, మద్దాల శ్రీనివాస్, ఆలయ ప్రోటోకాల్ అధికారి అప్పన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికలేనా.. పనులు జరిగేనా..!



చింతలపూడి ప్రాజెక్టుపై జనంలో చర్చ
2026కు మొదటి దశ పనులు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటన
రెండు దశల్లో ప్రాజెక్టు పూర్తి చేసేలా జలవనరుల శాఖ ప్రణాళిక
రూ.4,465 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనాలు
ఇప్పటికీ భూనిర్వాసితులకు అందని పరిహారం
ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, 12 లక్షల మందికి తాగునీరు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

జిల్లాలో మెట్టప్రాంతానికి ఎంతో కీలకమైన చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రణాళికలతో పరిమితం అవుతుందా.. లేక పనులు ముందుకు సాగిస్తుందా అనే చర్చ జిల్లా ప్రజానీకంలో నడుస్తోంది. చింతలపూడి ప్రాజెక్టు 2008లో ప్రారంభమైనప్పటికీ 16 ఏళ్ల పూర్తయినా ఇప్పటికీ పూర్తికాకపోవడమే అందుకు కారణంగా చెప్పొచ్చు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు, 12 లక్షల మంది ప్రజానీకానికి తాగునీరు అందే అవకాశం ఉంది. టిడిపి కూటమి ప్రభుత్వం ముందుగా రాష్ట్రవ్యాప్తంగా ఆరు సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు ప్రణాళికలు ప్రకటించింది. అందులో చింతలపూడి ప్రాజెక్టు కూడా ఉంది. దీంతో జిల్లా ప్రజానీకంలో ఈ ప్రాజెక్టు పూర్తిపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. 2008లో చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టును రూ.1,701 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టును కృష్ణా జిల్లాకు విస్తరించింది. ఈ ప్రాజెక్టు విస్తరణతో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు పూర్తికి రూ.4,909.80 కోట్లు ఖర్చవుతుందని ప్రణాళికలు రూపొందించారు. టిడిపి ప్రభుత్వంలో పనులు వేగవంతంగా సాగాయి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చింతలపూడి ప్రాజెక్టు పనులు పూర్తిగా పడకేశాయి. పాత బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. గడిచిన ఎన్నికల సందర్భంగా నూజివీడు, చింతలపూడి పర్యటనలో సిఎం చంద్రబాబు తాము అధికారంలోకొచ్చాక చింతలపూడి ఎత్తిపోతల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగినట్లుగానే ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలివిడతలో రూ.రెండు వేల కోట్లు ఖర్చు చేస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు, 2.10 లక్షల ఎకరాల స్థిరీకరణ దక్కుతుందని ప్రభుత్వం చెబుతోంది. మొదటి దశ పనులను 2026కు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. రెండో దశ పనులకు రూ.2,465 కోట్లు ఖర్చవుతుందని, పనులు పూర్తయితే లక్ష 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు 70 వేల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ, 12 లక్షల మంది ప్రజానీకానికి తాగునీరు అందనుందని ప్రభుత్వం చెబుతోంది. 2028 నాటికి ప్రాజెక్టు మొత్తం పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పుకొస్తోంది. పదిహేనేళ్లుగా ప్రభుత్వాలు ఐదేళ్లకోసారి చెబుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని జిల్లా ప్రజానీకం పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందించాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేనా?

చింతలపూడి ప్రాజెక్టుకు భూసేకరణ సమయంలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ సాగింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. చింతలపూడి రైతులకు మాత్రం ఎకరాకు రూ.12 లక్షలు మించి ఇవ్వడం కుదరదని తెలిపింది. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. బహిరంగ మార్కెట్లో ఎకరా ఖరీదు రూ.40 లక్షల వరకూ ఉందని, ఎకరాకు కనీసం రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అప్పటి టిడిపి ప్రభుత్వం స్పందించలేదు. 2019 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామని జగన్ తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక చింతలపూడిని పట్టించుకోవడం మానేసింది. దీంతో ఇప్పటికీ చింతలపూడి నిర్వాసిత రైతులకు పరిహారం అందలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ముందుగా ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాల్సి ఉంది. అప్పుడే ప్రాజెక్టు పనులు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం ఉంటుంది. రైతులకు ఇబ్బంది పెట్టి భూములు సాగనంపుకుంటే మాత్రం రైతుల నుంచి ప్రతిఘటన ఎదురుకాక తప్పదు. రైతులకు ఇప్పటికైనా న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

జైలుకెళ్లినా బుద్ధి మారలేదు..!

బెయిల్‌పై వచ్చి మరో ఘాతుకం
చిన్నారిపై అత్యాచార కేసు నిందితుని అరెస్టు
కఠిన చర్యలు తప్పవు: ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్



మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్

ప్రజాశక్తి – ఏలూరు స్పోర్ట్స్

2019లో రెంటచింతల ప్రాంతంలో బాలికపై అత్యాచారం కేసులో జైలు కెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటికొచ్చి లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అయినా బుద్ధి మారని ఆ మృగాడు మరో చిన్నారిపై అకృత్యానికి పాల్పడ్డాడు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో చిన్నారి అపహరణ, అత్యాచార కేసుకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఈ కేసులో నిందితుని అరెస్టు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ బుధవారం మధ్యాహ్నం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో గత ఆదివారం రాత్రి నానమ్మ వద్ద నిద్రిస్తున్న బాలికను ఆగంతకుడు సమీప పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి వదిలేసి పరారైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులకు సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సమాచారం అందిందని, వెంటనే ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు, ఏలూరు దిశా పోలీసు స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ హుటాహుటీన 15 నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి చేరుకున్నారని ఎస్‌పి తెలిపారు. అక్కడ నుంచి బాలికను వైద్యం నిమిత్తం నూజివీడు ఆసుపత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి ఎస్ఐ క్రాంతిప్రియ స్వయంగా తరలించారన్నారు. అనంతరం డిఎస్‌పి పర్యవేక్షణలో ఏలూరు టుటౌన్ సిఐ ప్రభాకర్, నిడమర్రు సిఐ సుభాష్ భీమడోలు సిఐ బి.రవికుమార్, నూజివీడు సిఐ కె.రామకృష్ణ నేతృత్వంలో నాలుగు బృందాలు దర్యాప్తు చేపట్టాయన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా గుంటూరు అర్బన్ డిఎస్‌పి, గుంటూరు ఎస్‌పి, పల్నాడు ఎస్‌పిల సహకారంతో నిందితుడు పల్నాడు జిల్లా రెంటచింతల మండలం కుమ్మరికోట గ్రామానికి చెందిన మిర్యాల జయరావుగా గుర్తించామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు పల్నాడు జిల్లాలో ఒక వాహనంలో ప్రయాణిస్తున్నట్లు గుర్తించి చాకచాక్యంగా మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. లారీ క్లీనర్‌గా పని చేస్తున్న జయరావు 2019లో రెంటచింతల ప్రాంతంలో బాలికపై అత్యాచారం కేసులో అరెస్టయి జైలుకెళ్లాడని, ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నాడని గుర్తించామన్నారు. బెయిల్ రద్దుకు సంబంధించి ఆయా అధికారులు, కోర్టు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. లారీ క్లీనర్‌గా నూజివీడు వచ్చి ఆదివారం రాత్రి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని, ఎటువంటి ఆధారాలు లేకపోయినా తమ సిబ్బంది సమర్థవంతంగా, అత్యంత చాకచక్యంగా పనిచేసి వేగంగా నిందితుడిని పట్టుకున్నారని ప్రశంసించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అఫండర్ అగైనెస్ట్ ఉమన్ అండ్ చిల్డ్రన్ పేరిట మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించి ప్రత్యేక రిజిస్టర్ తెరుస్తున్నామని, దాని ఆధారంగా ఒకటికి మించి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని స్పష్టం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారని తెలిపారు. సమావేశంలో ఏలూరు పూర్వపు డిఎస్‌పి శ్రీనివాసులు, భీమడోలు, నూజివీడు, నిడమర్రు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

మళ్లీ వర్షం.. కొండవాగులు ఉధృతం

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

భారీ వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసులు పహరా కాస్తున్నారు. రెడ్డిగణపవరం కాజ్‌వే, ఇప్పలపాడు కాజ్‌వే, అల్లి కాలువ కోట రామచంద్రపురం కాజ్‌వేలపై నుంచి నీరు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తోంది. బుట్టాయగూడెం గిరిజన బాలికల కళాశాల వసతి గృహం ప్రాంగణంలోనే వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపారిశుధ్య వాతావరణంతో విద్యార్థినులు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని, తక్షణం వసతి గృహం ప్రాంగణంలో నిలిచిన నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి పక్కనే ఉన్న బుట్టాయగూడెం పశువుల ఆసుపత్రి చిన్నపాటి వర్షానికి జలమయమైంది. గత నెలలో భారీ వర్షాలకు కొండవాగులు పొంగడంతో గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దీంతో ఆలయ దర్శనాన్ని కొన్ని రోజులు నిపివేసి పాడైపోయిన రహదారులను ఆలయ కమిటీ మరమ్మతులు చేసి ఈ నెల 4వ తేదీ నుంచి ఆలయ దర్శనాన్ని ప్రారంభించారు. మళ్లీ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆలయం పైనుంచి కొండ వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.



బుట్టాయగూడెంలో గిరిజన బాలికల హాస్టల్ ఆవరణలో నీరు



జీలుగుమిల్లి: అశ్వారావుపేట వాగు ఉధృతి

జీలుగుమిల్లి: మండలవ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు నిండుకుండల్లా మారాయి. పలుచోట్ల వరినాట్లు నీట మునిగాయి. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో కామయ్యపాలెం వాగు, అశ్వారావుపేట వాగు, సంగం వాగు, పాలచర్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బుట్టాయగూడెం రూరల్: భారీ వర్షాల కారణంగా కన్నాపురం పడమర కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

అమ్మకం, వినియోగంపై ప్రత్యేక నిఘా
ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14500
రవాణా అరికట్టేందుకు విస్తృతంగా చెక్‌పోస్ట్‌లు
కలెక్టర్ కె.వెట్రిసెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ఏలూరు: జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లో గౌతమి సమావేశపు హాలులో బుధవారం మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగంపై అధికారుల తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. వీటి రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా గంజాయి, డ్రగ్స్ వినియోగించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ పంపిణీ చేసే పెడ్లర్స్‌ను గుర్తించి వారిపై కఠిన కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్ సరఫరాపై 14500 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెంబర్‌ను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో, ప్రముఖ రోడ్ల కూడళ్లలో ప్రదర్శించాలన్నారు. ఎస్‌పి కె.ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, నాటు సారా అమ్మకాలు, రవాణాపై పెద్దఎత్తున నిఘా పెట్టామన్నారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 149 కేసులు నమోదు చేసి 540 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి దామా, ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, డిఆర్ఒ డి.పుష్పమణి, డిఇఒ అబ్రహం, ఆర్ఐఒ చంద్రశేఖర్, డిటిసి శాంతికుమారి, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కెఆర్‌పురంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి




ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, కలెక్టర్, ఎస్‌పి, జెసి, అధికారులు

ప్రజాశక్తి – బుట్టాయగూడెం

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కోటరామచంద్రాపురంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో ఈ నెల 9న నిర్వహించనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గిరిజన హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతియేటా ఆగస్టు తొమ్మిదో తేదీన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కెఆర్‌పురంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. అనంతరం కురసకన్నప్పగూడెం, రాజానగరంల్లో ఆమె పర్యటించారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ జి.శ్రీనుకుమార్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడి పివిఎస్.నాయుడు, ఇఇ కుమార్, కార్యాలయ మేనేజర్ ప్రకాష్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్, ప్రముఖులు బొరగం శ్రీనివాస్, కరాటం సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన డ్వామా పీడీ రాముకు వినతి అందజేత



మాట్లాడుతున్న పిచ్చుక ఆదిశేషు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

జిల్లాలో ఉపాధి హామీ వేతనాలు అందక కూలీలు నానావస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆ సంఘం జిల్లా బృందం ఉపాధి కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ డ్వామా పీడీకి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెండు నెలల నుండి ఉపాధి హామీ కూలీలకు చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు గడవటం కష్టంగా మారిందన్నారు. బడ్జెట్లో కూడా ఉపాధికి అతి తక్కువ నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కనీస వేతనం రూ.300 అని చెబుతున్నా అంతకన్నా తక్కువే వస్తుందని, దీంతో పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీల కుటుంబాలు గడవడమే చాలా కష్టంగా ఉందని తెలిపారు. జిల్లాలో రూ.110 కోట్లకుపైగా వేతన బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేతన చట్టప్రకారం 15 రోజులకోసారి వేతనం ఇవ్వాల్సింది పోయి నెలలు తరబడి పెండింగ్లో పెట్టడం ఎంతవరకు సమాంజసమని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి వరద ప్రభావిత కుటుంబాలకు, ముంపు ప్రాంతాల్లో ప్రజలకు ఉపాధి హామీ పనులు అదనంగా 150 రోజులు కల్పించాలని కోరారు. జిల్లాలో ముంపునకు గురైన అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు అదనంగా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, దానియేలు, ఆనందరావు, జాన్‌రాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

ప్రాజెక్టు స్పిల్వే నుంచి 6,00,331 క్యూసెక్కుల జలాలు విడుదల

ప్రజాశక్తి – పోలవరం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం బుధవారం నాటికి స్వల్పంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 6,00,331 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 30.670 మీటర్లు, స్పిల్వే దిగువన 21.770 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎల్లండిపేట కొవ్వాడ రిజర్వాయర్ వరద జలాలతో నిండుకుండలా మారింది. రిజర్వాయర్లో నీటిమట్టం 89.65 మీటర్లు నమోదయిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు గేట్ల ద్వారా 330 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు సిబ్బంది సత్యన్నారాయణ తెలిపారు. విడుదలైన కొవ్వాడ రిజర్వాయర్ జలాలు, కొండవాగుల జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్ల నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.

తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి – ఉంగుటూరు

మండలంలో తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విఒఎల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ సుభాషిని డిమాండ్ చేసారు. నారాయణపురంలో ఎంఎల్ఎ ధర్మరాజును కలవడానికి క్యాంపు కార్యాలయానికి బుధవారం వచ్చారు. అయితే ఆయన అందుబాటులో లేరు. ఈ సందర్భంగా సుభాషిని మాట్లాడుతూ మండలంలోని స్కీం వర్కర్స్, విఒఎలు పి.కనకదుర్గ(కాగుపాడు), బి.శారద(బొమ్మిడి), కె.లలిత,(కె.గోపాలపురం), తొలగించారని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల కాలంలోనే మండల ప్రాంతాలలో అధికార పార్టీ నాయకులు అధికార దుర్వినియోగంకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ అనధికారికంగా కొన్నిచోట్ల స్కీం వర్కర్స్‌ను అకారణంగా రాజకీయ నాయకులు తొలగిస్తున్నారని, ఇది సరైంది కాదని, సిఐటియు జిల్లా స్థాయిలో ఉద్యమించవలసి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి చీరా అప్పారావు, యూనియన్ నాయకులు కృష్ణకుమారి, రాధా, రబియా, శారద, లలిత పాల్గొన్నారు.


తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 11 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుమారు 40 తలసేమియా, సికిల్‌సెల్ కేసులు రెడ్ క్రాస్‌లో నమోదు అవుతున్నాయని, తల్లిదండ్రులలోని జన్యుపరమైన లోపాల కారణంగా ఈ వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, ట్రెజరర్ రేవూరి శివప్రసాద్, డాక్టర్ జి.స్పందన, ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్‌జివి బి.స్వామి పాల్గొన్నారు.

చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తాం..

ఎంఎల్ఎ బడేటి చంటి



ఎంఎల్ఎ బడేటి చంటితో మహిళలు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

చేనేత వృత్తులకు ప్రాధాన్యం, చేనేత వస్తువులకు ప్రాచుర్యం కల్పించి ఆ రంగంపై ఆధారపడిన కార్మికులందరినీ గత వైభవం దిశగా పయనింపజేసేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని టిటిడి కళ్యాణ మండపంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎంఎల్ఎ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను, ప్రోత్సాహకులను సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమైపోయిన చేనేతరంగానికి పూర్వవైభవం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కృషిచేస్తున్నారన్నారు. ఆ రంగంపై ఆధారపడిన సుమారు లక్షా 50వేల మంది చేనేతలను ప్రోత్సహించడంతో పాటూ చేనేత వస్తువులకు ప్రాచుర్యం కల్పించే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. వ్యవసాయరంగంతో సమానంగా చేనేత రంగాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఎంఎల్ఎ చంటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధికార ప్రతినిధి వానపల్లి నాగరాజు, మాజీ కార్పొరేటర్ కప్పా ఉమామహేశ్వరరావు, ఏలూరు పద్మశాలి సంఘం అధ్యక్షులు వానపల్లి రామకృష్ణ, గిడుతూరి వెంకట సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి పి.వెంకట్రావు, కార్పొరేటర్ బాలాజీ, అల్లంపూర్ణ చంద్రరావు, దివి లక్ష్మి, మొండూరి సత్తిబాబు పాల్గొన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు



మాట్లాడుతున్న పిచ్చుక ఆదిశేషు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

చేనేత రంగానికి రాష్ట్ర బడ్జెట్లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక పత్తేబాద మరక వారి వీధి సెంటర్లో బుధవారం చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత చేనేత మగ్గం పతాకాన్ని కార్మికుల హర్షధ్వానాల మధ్య ఆదిశేషు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా చేనేత రంగం కునరిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతకు మరణ శాసనమైన జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికీ నెలకు రూ.రెండు వేల చొప్పున జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర నాయకులు కొల్లి ఈశ్వర్, చేనేత కార్మికులు కుర్మా మోహన్‌రావు, కుర్మా నాగేశ్వరి, ఎర్ర సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో ఉపాధి పనులకు గండి

ఉపాధి చూపి, కూలీ డబ్బులు ఇవ్వాలని కూలీల ఆవేదన



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి – బుట్టాయగూడెం రూరల్

గత ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాలతో కూలీలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. ఉపాధి హామీ పనులను భారీగా తగ్గించిన కేంద్రం వేల సంఖ్యలో కూలీల కుటుంబాల కడుపు కొడుతుంది. ఎన్నో కుటుంబాలను ఉపాధి హామీ పనులకు దూరం చేసింది. రోజువారీ కూలీ డబ్బులు అందక పలువురు కూలీలు ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గత మూడు నెలలుగా కూలీ డబ్బులు అందలేదు. ఇప్పటికైనా కూలీ డబ్బులు అందించి, ఉపాధి పనులు చూపాలని ఐటిడిఎ కోట రామచంద్రపురం, ఎర్రయిగూడెం గ్రామస్తులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వేలేరుపాడు రూరల్ : అరకు ఎన్నికల సభలో ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ పత్రికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుట్టాయగూడెం కెఆర్ పురం ఐటిడిఎ ప్రాంగణంలో జరిగే ఆదివాసి దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీ బిడ్డలకు ఇచ్చిన నిర్దిష్ట హామీలు అమలు చేయాలని కోరారు.

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని రామానుజపురం గ్రామంలో భార్యను కత్తితో భర్త నరికిన ఘటన కలకలం సృష్టించింది. ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం రాజనాల సూర్యచంద్రం భార్య సాయిలక్ష్మి(35) ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా మెడపై కత్తితో భర్త నరికి చంపాడన్నారు. ఘటన అనంతరం మృతురాలు భర్త స్థానికులకు వివరించిన కథనం ప్రకారం తరచూ ఫోన్లో మాట్లాడుతుందని, ఎవరు అని అడగగా తన పుట్టింటి వాళ్లకు ఫోన్ చేశానని చెప్పడంతో ఘర్షణకు దారి తీసిందన్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానంతోనే భార్యను హతమార్చినట్టు తెలుస్తుంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పారిశుధ్య కార్మికుడు మృతి

చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన యలమర్తి సాయిబాబు(52) మంగళవారం రాత్రి మృతి చెందడం జరిగింది. గత తొమ్మిది సంవత్సరాల నుంచి చాట్రాయి గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న సాయిబాబు వెన్నుముక అరుగుదల వ్యాధితో బాధపడుతూ, విజయవాడ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ, మందులు వాడుతూ, వారం రోజుల క్రితం స్వగ్రామమైన చాట్రాయికి రావడం జరిగింది. మంగళవారం ఇంటిదగ్గర సాయంత్రం సమయంలో శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా మారడంతో చాట్రాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయిబాబు పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'చేతివృత్తులతో సృజనాత్మకత బహిర్గతం'

ఆగిరిపల్లి: నైపుణ్య శిక్షణ, చేతివృత్తులు యువతీ యువకుల జీవనోపాధీ అవకాశాలను మెరుగు పర్చడంతో పాటు వారిలో దాగి వున్న సృజనాత్మకతను బహిర్గతం చేస్తాయని విజ్ఞాన్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సెలర్, యుజిసి మాజీ మెంబర్ సెక్రటరీ, ప్రొఫెసర్ కె.రామమూర్తి నాయుడు అన్నారు. తోటపల్లి హీల్ పారడైజ్ ఆవరణలో గల పవర్ మెక్ వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో టెక్స్‌టైల్స్ ప్రింటింగ్ యూనిట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మీ, సిఇఒ కూరపాటి అజయ్‌కుమార్, ప్రముఖ ఆర్ట్ సైంటిస్టు కె.కృష్ణమూర్తి, సైబర్ సెక్యూరిటీ కోర్స్ ఇన్‌ఛార్జి రాజీ, కృపానిధి, ప్రిన్సిపల్ బి.సాయిబాబు, హరీష్‌లు పాల్గొన్నారు.

'పొలంబడి ద్వారా ఆరోగ్యకర పంటలు'

టి.నరసాపురం: పొలంబడి ద్వారా రైతులు ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని చింతలపూడి వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్ అన్నారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ పొలంబడిలో పండించిన పంటకు నాణ్యతా ప్రమాణాల పరీక్ష చేయించాలన్నారు. ఇండిగాప్ వారు నాణ్యతను పరీక్షించి ధృవీకరణ పత్రం అందిస్తారని తెలిపారు. రైతులు వారు పండించిన పంట ఎఫ్‌పిఒ ద్వారా అధిక ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. నారుమడులు వేసేటప్పుడు నారు చివర ఆకులను కత్తిరించటం ద్వారా కాండం తొలుచుపురుగు గుడ్లను సంహరించవచ్చని చెప్పారు. మండల వ్యవసాయాధికారి బి.సుమలత మాట్లాడుతూ రైతులు పొలంబడిలో తప్పనిసరిగా పాల్గొన్నాలన్నారు. పొలంబడి ద్వారా అందిస్తున్న సూచనలు, సలహాలు పాటించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎ.బాలాజీ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

టి.నరసాపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసి(పాఠశాల యాజమాన్య కమిటీ) ఎన్నికలు నిర్వహిస్తామని మండల ఎంఇఒ-1 టి.రామ్మూర్తి బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈనెల 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులు ఎన్నుకోబడతారని, ఎన్నుకోబడిన సభ్యుల నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నుకుంటారన్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులలో ఇద్దరు మహిళలు ఖచ్చితంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఛైర్మన్, వైస్ ఛైర్మెన్లలో కూడా ఒకరు మహిళ ఉండాలని తెలిపారు. 60 పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పాఠశాలలకు వచ్చి ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్ప రాజకీయ నాయకులు, మీడియా వారికి ఎవరికీ పాఠశాల పరిసరాల్లో అనుమతులు లేవన్నారు.

నూతన పాఠశాల ప్రారంభం

వేలేరుపాడు రూరల్ : రెండేళ్లుగా ఎదురుచూస్తున్న చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీ విద్యార్థులకు ఎట్టకేలకు విద్యాశాఖ అధికారుల చొరవతో బుధవారం గ్రామస్థుల సమక్షంలో పాఠశాల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం, వేలేరుపాడు ఎంఇఒలు రాముడు, శ్రీనివాస్, రాములు హాజరయ్యి విద్యార్థుల చదువుకు గ్రామస్తులు చేసిన ప్రయత్నాలు ఈరోజుతో ఫలించడం చాలా సంతోషంగా ఉందని, దీనికి సహరించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఆర్అండ్ఆర్ కాలనీలో స్కూల్ లేక పిల్లలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. అనంతరం విద్యాశాఖ అధికారులను గ్రామస్తులు ఉపాధ్యాయులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మిరియాల పుల్లారావు(ఆర్ఎంపి), సత్యనారాయణ పాల్గొన్నారు.

'పాల ఉత్పత్తిదారులకు అండగా కృష్ణామిల్క్ యూనియన్'

మండవల్లి: పాల ఉత్పత్తిదారులకు కృష్ణామిల్క్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షులు పిండి రాధాకృష్ణ స్పష్టం చేశారు. పెరికేగూడెంలోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో కృష్ణామిల్క్ యూనియన్ వారి బోనస్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో కృష్ణామిల్క్ యూనియన్ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పడానికి ఎటువంటి సందేహం లేదన్నారు. గుడ్లవలేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో రూ.54 లక్షలు కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.13 కోట్లను 2024-25 సంవత్సరానికి మొదటి విడతగా నాలుగు మాసాలకు 10 శాతం బోనస్‌గా పాల ఉత్పత్తిదారులకు అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అశ్విన్ కుమార్, గోపీరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధరణి మహిళా అభ్యుదయ సంఘం సభ్యులకు అవగాహన

ఏలూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం నందు ధరణి మహిళా అభ్యుదయ సంఘం(సెక్స్ వర్కర్స్) సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధదేవ్ కర్మాస్కర్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పశ్చిమ బెంగాల్ కేసులో ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధరణి మహిళా అభ్యుదయ సంఘం ప్రాజెక్ట్ ఆఫీసర్ విష్ణుతేజ, డిసిపిఒ సూర్య చక్రవేణి, దిశ ఎస్ఐ వి.క్రాంతి ప్రియ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ఏలూరు స్పోర్ట్స్: విద్యుత్ ఘాతానికి గురై ఏలూరు మున్సిపల్ కార్యాలయంలో నీటి పనులు, కలాయి పనులు కట్టించుకునే అసిస్టెంట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు ఒకటో పట్టణ ఎస్ఐ లక్ష్మణ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని శనివారపుపేట ప్రాంతానికి చెందిన దాసరి అశోక్ కుమార్(37) స్థానికంగా ఏలూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయ బిల్ కలెక్టర్ వద్ద అసిస్టెంట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఉదయం మంచినీరు వచ్చే సమయంలో నీటి మోటార్లు కరెంటులో ఉంచి మెయిన్ లైన్ నుంచి వాటరీను తోడుతారు. అనంతరం మోటర్లను తీసివేసి మరలా సాయంత్రం ఇదే పనిని కొనసాగిస్తారు. ఈ క్రమంలో యథావిధిగా బుధవారం కూడా మంచినీరు వచ్చే సమయంలో మోటార్లు మెయిన్ పైప్ లైన్‌కు కనెక్ట్ చేసి వాటర్ పట్టుకోవడం అయిపోగానే తిరిగి మోటర్‌ను తీసేందుకు అశోక్ కుమార్ విద్యుత్ వైర్లను ఒక్కసారిగా లాగాడు దీంతో అతను ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడే కుప్పకూలాడు. వెంటనే బంధువులు అతన్ని చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు.

డయేరియా నివారణకు అవగాహన

కామవరపుకోట: అతిసార వ్యాధి నిర్మూలనకు మంచినీరు, పరిశుభ్రత కీలకమని జెజెఎమ్ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. డయేరియా అందరం కలిసి అరికడదాం కార్యక్రమంలో భాగంగా బుధవారం తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డయేరియా నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం అంగులూరి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తి చేయాలి

రైతుల భూములకు సాగునీరు అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు వెంటనే పూర్తిచేయాలని, రైతుల భూములకు సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమల మండలంలోని ఎం.నాగులపల్లి, గోపాలపురం, పి.కన్నాపురం గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు రైతులతో కలిసి పర్యటన చేసి అసంపూర్తిగా ఉన్న తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువను పరిశీలించారు. తాడిపూడి కాలువల పనులు పూర్తికాకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ పనులు పూర్తి కాకపోవడంతో ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. కాలువల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాడిపూడి ఎత్తిపోతలు ద్వారా గోదావరి జలాలు అందిస్తే భూసారం పెరిగి పంటల దిగుబడులు పెరగడమే కాకుండా భూగర్భ జలాల మట్టం కూడా పెరిగి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. రైతులు త్యాగం చేసి భూములు ఇస్తే అరకొరగా తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువలు తవ్వి సంవత్సరాలు తరబడి పూర్తి చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం తాడిపూడి ఎత్తిపోతల పథకంపై దృష్టిసారించి, తగిన నిధులు కేటాయించి, కాలువల పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. తవ్విన కాలువల్లో పేరుకుపోయిన జంగిల్‌ను, కాలువ పూడికలను, ఆక్రమణలను, గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ద్వారకాతిరుమల, దెందులూరు మండలాల రైతుల భూములు సస్యశ్యామలమవుతాయని చెప్పారు. బోర్ల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు కాలువల ద్వారా నీరు అందిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువల పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు ఎం.నాగులపల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువ ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు చెందిన రైతులు పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలుకొండ నాగరాజు, తమ్మిన రవి, టి.మురళీ, గరికపాటి సుబ్బారావు పాల్గొన్నారు.



తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

కొయ్యలగూడెం తహశీల్దార్‌గా దొర

కొయ్యలగూడెం: మండల తహశీల్దార్‌గా చెల్లన్న దొర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విఆర్ఒ అసోసియేషన్ నాయకులు ఆయనకు సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ స్పందనలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్

ఆగిరిపల్లి: మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషిచేస్తాని ఆగిరిపల్లి మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. కంకిపాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఆయన బుధవారం నాడు ఆగిరిపల్లి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్, మండల సర్వేయర్ నాగరాజు, విఆర్ఒలు టి.రవిశేఖర్, పి.శ్రీనివాసరావు, బి.సుబ్బయ్య, గ్రామ సర్వేయర్లు, విఆర్ఎలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ద్వారకా తిరుమల తహశీల్దార్‌గా సుబ్బారావు

ద్వారకాతిరుమల: మండల తహశీల్దార్‌గా జెవి.సుబ్బారావు నియమితులయ్యారు. టి.నర్సాపురంలో పనిచేసిన సుబ్బారావును ద్వారకాతిరుమల తహశీల్దార్‌గా నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ దుర్గా మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఉద్యోగులు, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చింతలపూడి తహశీల్దార్‌గా ప్రమద్వర

చింతలపూడి : చింతలపూడి తహశీల్దార్‌గా డిఎల్.ప్రమద్వర బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమితులైన తహశీల్దార్ గోపాలకృష్ణ తన సొంత జిల్లా రాజమండ్రికి బదిలీ కావడంతో ఈ స్థానంలో ప్రభుత్వం ప్రమద్వరను నియమించింది. డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కె.షకీలున్నిసా నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ముదినేపల్లి తహశీల్దారుగా సుభాని

ముదినేపల్లి: మండల తహశీల్దారుగా జెఎస్.సుభాని బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మండవల్లి మండల తహశీల్దార్‌గా పనిచేస్తున్న జెఎస్.సుభాని ముదినేపల్లి మండల తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, విఆర్ఒలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలిదిండి ఎంఇఒగా నరేష్ కుమార్

కలిదిండి : కలిదిండి ఎంఇఒగా కొల్లాటి నరేష్ కుమార్ బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు జులై 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను ముదినేపల్లి ఎంఇఒగా పనిచేస్తున్న కొల్లాటి నరేష్ కుమార్ చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకంక్షలు తెలిపారు.

అందరికీ తాగునీటి సౌకర్యం ఏర్పాటు

సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి

ప్రజాశక్తి - ముసునూరు

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కూళాయిలు ఏర్పాటు చేసి, అందరికీ మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ముసునూరు గ్రామ సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి తెలిపారు. బుధవారం మండలకేంద్రమైన ముసునూరు గ్రామ సచివాలయంలో ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ముసునూరు గ్రామానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ గత రెండు, మూడు నెలల నుంచి వర్షాకాలంలో గ్రామస్తులు అనారోగ్యానికి గురికాకుండా మంచినీటి సౌకర్యం అందించామన్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేస్తూ, ప్రోక్లైన్ ద్వారా డ్రెయినేజీ పూడికలు తీయిస్తూ, బిసి ఏరియాలోని రజకుల బజార్లోని తూర్పు నరసింహస్వామి ఆలయం వద్ద వంతెన నిర్మాణం, అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద మరొక వంతెన నిర్మాణం, పడమర బిసి ఏరియాలోని సిమెంట్ రోడ్డుకి, తారురోడ్డుకి అనుసంధానంగా భారీ వంతెన నిర్మాణం చేసి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ గ్రామస్తులతో మమేకమై, పనులు సాగిస్తూ, గ్రామ సర్పంచిగా తమ బాధ్యతలు చేపడుతున్నట్లు ఆమె తెలియజేశారు.



వంతెన నిర్మాణం చేపడుతున్న సర్పంచి విజయలక్ష్మి బాబి, టిడిపి నాయకులు

టీ-స్పర్ష్ నూతన షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

టయోటా కిర్లోస్కర్ మోటార్స్ వాహనాల అధీకృత డీలర్ అయిన పృథ్వీ టయోట తమ నూతన టీ-స్పర్ష్ షోరూమ్‌ను ఏలూరు కెనాల్ రోడ్డులో బుధవారం ప్రారంభించారు. ఈ నూతన షోరూమ్‌లో సరికొత్త టయోటా అర్బన్ క్రూజర్ టైజర్ వాహన శ్రేణిని కూడా ఆవిష్కరించారు. ఈ కొత్త షోరూమ్‌లో అన్ని రకాల టయోటా వాహనాల ప్రదర్శన, టెస్ట్ డ్రైవ్ సౌకర్యం కూడా కలదని యాజమాన్యం తెలిపింది. అన్ని టయోటా వాహనాలకు బుకింగ్స్ స్వీకరించబడును, డెలివరీ కూడా ఇక్కడే ఇవ్వబడునని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ఏలూరు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవలసిందిగా పృథ్వీ టయోటా యాజమాన్యం కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ, టయోటా సౌత్ హెడ్ మహారాజా, ఎపి హెడ్ నిఖిల్, టయోటా ఏరియా మేనేజర్ శశికాంత్, పృథ్వీ టయోటా ఛైర్మెన్ మాలెంపాటి రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీ చంద్ర, సిఇఒ కిరణ్‌కుమార్‌తో పాటు కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన షోరూమ్ ప్రారంభోత్సవంలో ఎంఎల్ఎ బడేటి చంటి

గుంతలతో ప్రజల అవస్థలు

పల్టీ కొట్టిన వ్యాను

ప్రజాశక్తి - ముదినేపల్లి

రహదారులపై ఏర్పడ్డ మహాగుంతలతో ఇటు ప్రజలు, అటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని రహదారులు అధ్వాన్నంగా తయారై ప్రజలు పాలిట ప్రాణ సంకటంగా మారాయి. రోడ్లపై ప్రయాణించే ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోయింది. అన్ని రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. ఈ కారణంగా ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు ఈ గోతులను చూసి బెంబేలెత్తుతున్నారు. రోడ్డుపై గుంతలు చెరువులను తలపించడంతో దారి కనపడక ఎటు వెళ్లాలో తెలియక తికమక పడుతున్నారు. దీంతో గుంతలో పడి క్షతగాతులుగా మారుతున్నారు. గురజ గ్రామంలో ఏర్పడ్డ మహాగుంతలో నాట్లు వేసేందుకు వరినారు లోడుతో వెళుతున్న వ్యాన్ బుధవారం పల్టీ కొట్టింది. దీంతో నారంతా రోడ్డుపై బురద నీటిలో పడిపోయింది. ఈ రీతిన నిత్యము ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, సైకిల్‌పై పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యము ఈ మహా గుంతల వద్ద ప్రమాదాలకు గురవుతూ మహాయాతన అనుభవిస్తున్నారు. ఈ గుంతను దాటాలంటే గండం గడిచినట్లుగానే ఉంది ప్రజలకు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం గోతుల వద్ద మెటీరియల్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



మహా గుంతలో పల్టీ కొట్టిన వ్యాను

తల్లిపాలపై అవగాహన పెంచుకోవాలి

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తల్లిపాలతో ఎన్నో పోషక విలువలు కలిగిన ఆహారం బిడ్డకు అందుతుందని తల్లులు, గర్భిణులు అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ అధికారిణి కె.విజయలక్ష్మి అన్నారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు సెక్టార్ పరిధిలో 28 అంగన్వాడీ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం గోపాలపురంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ శారదామని అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిడిపిఒ మాట్లాడి గ్రామస్తులకు, గర్భిణులకు పలు విషయాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార విలువలపై తెలియజేశారు.

ఏలూరు సిటీ : ఏలూరులోని 12 పంపులు సెంటర్ వద్ద ఉన్న గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవివి ఎల్.పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, పుట్టిన గంటలోపే ముర్రిపాలు ఇవ్వాలని అన్నారు. ఇందులో భాగంగా సిడిపిఒ ఎ.పద్మావతి మాట్లాడుతూ అంతరాలను పూరించి, తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం అనే నినాదంతో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతాలు, ఆరునెలలు నిండిన వారికి అన్నప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశాంక్, డాక్టర్ మానస, గాంధీ మున్సిపల్ స్కూల్ హెచ్ఎం కృష్ణ భగవాన్, సూపర్వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసన్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా కొరగుంటపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్వైజర్ ప్రసన్న మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన వరమన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ నాగలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

మండవల్లి: పుట్టిన బిడ్డకు తల్లిపాలే వ్యాధి నిరోధక టీకా అని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అయ్యవారి రుద్రవరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని తెలిపారు. అనంతరం వందరోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళల రక్షణ, చట్టాలు, బాల్య వివాహాలు తదితర కార్యక్రమాలకు అవగాహన కలిగించి గ్రామంలో పెద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బోనం శేషగిరి, ఉపసర్పంచి ఇంటి నాగరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నికృష్ణ యాదవ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తల్లిపాలు బిడ్డలకు అమృతాహారమని, అప్పుడే పుట్టిన బిడ్డలకు ముర్రిపాలు పట్టడం వల్ల వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిండంతో పాటు, శారీరక పెరుగుదలకు దోహద పడతాయని ఆగిరిపల్లి గ్రామ సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి సెక్టార్ పరిధిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ జి.రాగమయి, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం: తల్లిపాలే శిశువులకు అమృతదార అని పట్టిసీమ అంగన్వాడీ వర్కర్లు శిశువుల తల్లులకు అవగాహన కల్పించారు. బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టిసీమలో కోడ్ నెంబర్ 46, 47 అంగన్వాడీ సెంటర్లలో బాలింతలకు, గర్భవతులకు తల్లిపాల వల్ల ప్రయోజనాలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి.పోశమ్మ, జి.రత్నశ్రీ, ఎం.సుధారాణి, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మండలంలోని కొయ్యలగూడెం సెక్టార్ పరిధిలో సూపర్వైజర్ నయోమీ రాణీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఐసిడిఎస్ పిఒ యుఎన్.స్వర్ణ కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తల్లిపాల వల్ల సరైన పోషకాహారం, రోగ నిరోధక వ్యవస్థను మెరుగు పరచడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు నాగవేణి, శ్రీదేవి, నూర్జహాన్, వెంకటలక్ష్మి, చంద్రకళ, శిరీష, పద్మావతి, తల్లులు హాజరయ్యారు.

కామవరపుకోట: పుట్టిన బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలని అమ్మపాలులో ఉన్న ఆరోగ్యం ఆవు పాలల్లో కూడా ఉండవని అంగన్వాడీ సూపర్వైజర్‌లు బివిఎల్.మంగాదేవి, ఎన్.వీర కుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కామవరపుకోట, తడికలపూడిలలో అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

చింతలపూడి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో లింగపాలెం పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సకాలంలో హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒపి, సిబ్బంది హాజరు రికార్డులు తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచనలు చేశారు. టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.